రక్తము మాంసశల్యముల రాశియు దేహము మీరుకాదు సు
వ్యక్తము కాని కోరికల వ్యక్త మనస్సును మీరుకాదు సూ
ముక్తికి బంధకారమగు మోహపు భ్రాంతియు మీరుకాదుమీ
శక్తిని మీరెరుంగ గల శాశ్వతుడౌ పరమాత్మ మీరెగా

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి యీ నాలుగు కూడను మానవుడు ధరించిన ఉపాధులు మాత్రమే. ధరించిన పదార్థముల యొక్క రహస్యమును గుర్తించినప్పుడే ఆ పదార్థములు కూడను సరియైన స్థితిలో మనము వుపయోగించుకోవచ్చును. మీరు pant, shirt, బనీను, కోటు యివన్నీ మీరు ధరిస్తూ వుంటారు. ఏ ఉపాధిని ఏ విధముగా ధరించాలి అనే విషయమును మీరు గుర్తించినప్పుడే అది సక్రమమైన వినియోగంగా మీరు అనుభవిస్తారు. అట్లుకాక shirt అంటే యేమిటో తెలియకుండా వుండినప్పుడు దీనిని వికారముగా కూడను వినియోగించుకోటానికి అవకాశము వుంటుంది. ఈ బనీను అంటే యేమిటో అర్థము చేసుకోనటువంటివారు shirt పైన బనీను వేసుకోవచ్చును. ఈ pant అంటే తెలియని సమయములో వెనుకది ముందు ముందు వెనుక ధరించవచ్చును. కనుక మీరు నిత్యము ధరించే వస్త్రములను చక్కగా గుర్తించి దాని పరిజ్ఞానము చేత అనుభవించటానికి పూనుకుంటున్నారు. అప్పుడే ఆ దుస్తులు అలంకారముగా ఆనందము నందిస్తున్నది. అటులనే మనము ధరించిన యీ దేహము కేవలము వస్త్రము వంటిదే. దీనిని యేవిధముగా మనము ధరించాలి ఏ విధముగా దీనిని అనుభవించాలి, యే విధముగా దీనిని వినియోగించాలి అనే విషయమును మొట్టమొదట గుర్తించినప్పుడే సద్వినియోగమవుతుంది దేహము.

దహ్యతే ఇతి దేహః అని దీనికి వ్యుత్పత్తి. అనగా దహింపబడేది యీ దేహము అని. మరణించిన తరువాత దహింపబడటము యిది అందరికి తెలుసు. అట్లుకాక జీవిత సమయమునందే యిది దహింపబడుతున్నది. ఎట్లనగా చింతలచేత

యీదేహము దహింపబడుతున్నది. కనుక యిది జడస్వరూపమైనది. మాలిన్యముతో కూడినది.

మలినపుకొంప రోగముల మగ్గెడు సేవకగంప జాతసం
చలనము పొందుదుంప భవసాగర మీదగలేని కంప అం
బులపాదిరెమ్ము చూడు మన మెప్పు దలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.

అని ప్రబోధించారు యీ దేహమును.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడనా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ

ఆదేవదేవుడైన మీరు ధరించినదే యీ దేహము. ధరించిన దేహమును వరించవచ్చు అనుభవించవచ్చు కాని ఏ విధముగా వరించాలి. ఏ విధముగా అనుభవించాలి అనే విచక్షణా జ్ఞానముతో దానిని పొందాలి.

దీనికి మరొక పేరు కలదు శరీరము అని. దీని వ్యుత్పత్తి. శీర్యతే యితి శరీరః అన్నారు. అనగా జీర్ణించునది, క్షీణించునది యీ శరీరము. ఇది పుట్టినప్పుడు రక్తపు ముద్దగా వుంటుంది. కోమలత్వముతో ఆకర్షింప జేస్తుంది. క్రమక్రమేగా యిది యవ్వనములో ప్రవేశిస్తుంది. అందచందముల చేత అహంకారమును ప్రకటిస్తుంది. తదుపరి వృద్ధాప్యములో యిది ప్రవేశిస్తుంది. వికారత్వాన్ని పొందుతుంది. ఈ శరీరము అనేకరకములుగా మార్పు చెందునది. జీర్ణించేది, మార్పు చెందేది కనుక దీనికి శరీరమని ఒక పేరు.

ఈ శరీరమునకు మూడవ పేరు కూడను వుంటున్నది. ఇదే మందిరము అని. అనేకమంది వుచ్చరిస్తూ వచ్చారు. ఈ మందిరము దేని నిమిత్తమై యేర్పడినది. దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః. దేవుడైన జీవునకు యీ దేహము ఒక మందిరముగా నిర్మించబడినది. మందిరమును మనము యేవిధముగా వుపయోగించాలి. ఇది పవిత్రమైన దివ్యమైన భగవంతుని నిలయము. భగవంతుని నిలయమైన యీ దేహమును దుర్వినియోగపరచుటకు యేమాత్రము వీలుకాదు. దీనిని

సక్రమమైన మార్గములో, పవిత్రమైన మార్గములో దీనిని వినియోగించాలి. కనుకనే సత్కర్మలు, సదాచారములు, సచ్చింతనలు సలిపే నిమిత్తమై యేర్పడినదే యీ దేహము. ధర్మాచరణ నిమిత్తమై నియమించినది యీ దేహము అని. శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం. ఈ ధర్మాచరణ నిమిత్తమై యేర్పడినదే యీ దేహము అయితే యీ దేహమును సరైన స్థితిలో మనము వుంచుకోవాలి.

ఈ దేహము ఒక పనిముట్టు వంటిది. ఈ పనిముట్టు సరియైన స్థితిలో వుండినప్పుడే మనము సంకల్పించుకొన్న పనిని సరియైన రీతిగా చేసుకొనవచ్చు. ఒక పనిముట్టు పెన్ను మన దగ్గర వుంది. దీనిని వినియోగించుకోవాలంటే దీనిని సరియైన స్థితిలో మనము పెట్టుకోవాలి. కాలు సరిగా వుండాలి. యింకు దీనిలో వుండాలి. ఇది సరియైన రీతిలో వుంచుకున్నప్పుడే వ్రాయుటకు వుపయోగమవుతుంది. కత్తి ఒక పనిముట్టు. ఐతే ఆ కత్తి కూడను సరియైన పదునుగా వుండినప్పుడే అది సద్వినియోగము గావించుకోవచ్చు. కనుక ఏ ఏ పనిముట్టు ఏ ఏ స్థితియందు సరిగా వుండినప్పుడే ఆయా పనులు మనము సక్రమముగా చేసుకోవచ్చు. ఈ దేహము కూడను ఒక పనిముట్టే. ఈ కర్మాచరణ నిమిత్తమై యీ దేహము సరియైన స్థితిలో వుంచుకోవాలి. కత్తితో ఫలములో, కూరగాయలో యింకే విధమైన చిక్కుపడిన గంట్లో మనము కోసుకోవచ్చును, కోసుకోవచ్చును.. అట్లు కాకుండా కత్తితో మనము యినుము కోయటానికి ప్రయత్నిస్తే యీ కత్తి కూడను పదును తప్పిపోతుంది. అదే విధముగనే యీ దేహము ఏ ఏ కార్యముల యందు సద్వినియోగము గావించుకోవాలో విచక్షణా జ్ఞానముతో వినియోగించుకోవాలి. యిక్కడ ఏ కార్యము చేయటానికి మనము పూనుకున్నా కూడను అక్కడ ప్రశ్నను మనం వేసుకోవాలి. ఆత్మ స్వరూపుడైన బ్రహ్మను నేను. యీ కాయములో నివసిస్తున్నాను. ఆత్మ స్వరూపుడైన నేను, బ్రహ్మ స్వరూపుడైన నేను యీ కాయముచే యీ కర్మలు నేను ఆచరించవచ్చునా ఆచరించకూడదా అని విచారణ చేసుకోవాలి. ఈ కర్మ చేయ తగినదా చేయతగనిదా అనే విషయము కూడా విచారించుకోవాలి. అప్పుడే యీ దేహమును సద్వినియోగము గావించుకున్న వాడవవుతావు.. ఈ దేహము వున్నది కదా అని యిష్ట ప్రకారము వినియోగించుకోరాదు. దానినే ధర్మవిరుద్ధమైన చర్యలలో వుపయోగించుకున్నట్లవుతుంది. ధర్మాచరణ నిమిత్తమై యేర్పడినది యీ దేహము దైవ మందిరముగా నిర్మించబడినది యీ దేహము.

దీనిని మరొక పేరుగా క్షేత్రము అని చెబుతూ వచ్చారు. క్షేత్రమనే దేహము దీనిని గుర్తించేవాడు క్షేత్రజ్ఞుడు. నేను క్షేత్రాన్ని గుర్తించేవాడనే గాని గుర్తింపబడేటి దేహమే. గుర్తించేవాడు కనుక నేను దీనికి సాక్షీభూతుడుగా వుండుండాలి. దీనిని సద్వినియోగముగా అనుభవించుటానికి తగిన అధికారిగా వుండుండాలి. చాలా పవిత్రమైన స్థితిలో దీనిని వుంచుకోవాలి. కాశీ ఒక క్షేత్రము అంటారు. బదరీ ఒక క్షేత్రము అంటారు. తిరుపతిని ఒక క్షేత్రము అంటారు. ఈ క్షేత్రము అనే పదమును వినియోగించుకోటములో అంతరార్థము యేమిటి? అక్కడ దైవ సంబంధమైన వాతావరణము లో కూడుకున్నటువంటిది. పవిత్రమైన స్థానము కనుక దీనికి క్షేత్రమనే సార్థక నామము వచ్చింది. ఆ క్షేత్రములో నిరంతరము పూజలు, సత్కర్మలు, మంత్రములు, యజ్ఞలు యిలాంటివి జరుగుతూ వుంటాయి అదే విధముగనే యీ దేహమనే క్షేత్రమునుంచి సత్కర్మలు, సదాచారములు, సచ్చింతనలు యిలాంటి సేవలయందు పాల్గొజేసుకోవాలి. సత్కర్మలయందు ప్రవేశింప చేయుటమే క్షేత్రము యొక్క సరియైన అంతరార్థము.

క్షేత్రమంటే రెండవ అర్థము వుంటున్నది. పొలము అని రెండవ అర్థము. ఈ పొలములో మనము యెట్టి విత్తనములు నాటుదుమో అట్టి ఫలమే మనకు లభిస్తుంది సత్సంకల్పములనే విత్తనములు నాటినప్పుడు సత్ఫలము మనకు లభ్యమవుతుంది. దుస్సంకల్పములు అనే విత్తనములు నాటినప్పుడు ఒకవిధమైన దుష్ఫలములే మనకు లభిస్తుంటాయి. పాపపుణ్యములు అనే బీజములు నాటుకొనే ప్రదేశమే యీ దేహమనే క్షేత్రమం. లౌకిక ప్రపంచమందు లౌకిక భూముల యందు లౌకికముగా ఆచరించే దీనిలో సరియైన కాలము సరియైన స్థితిని మనము చూస్తూ వుంటాము. ఫలాని ఋతువునందు ఫలాని విత్తనములు నాటాలి. అని పద్ధతి వుంటున్నది. ఏ క్షేత్రము నందు ఏ పంటను పెట్టాలి అనే నియమము కూడా వుంటున్నది. ఎప్పుడు పడితే అప్పుడంతా ఆ పొలములో విత్తనములు చల్లటానికి వీలుకాదు. అది ఒక కాలనిర్ణతమును కలిగి వుంటున్నది. కాని యీ శరీరమనే పొలము లోపల ఒక నిర్ణీతమైన కాలము లేదు. సర్వకాల సర్వావస్థల యందు కూడను దీనిని సాగు చేసే అనుకూలము కలిగి వుంటున్నది. రాత్రింబవలు కూడను దీనిని సాగు చేసుకొన వచ్చును. బాహ్య సంబంధమైన పొలములలో విత్తనములు నాటినప్పుడు పంటలు పండవచ్చును లేక పోతే ఎండవచ్చును. ఆశించిన ఫలములు మనము పొందలేక పోవచ్చును. కాని యీ శరీరమందు నాటుకున్న సత్సంకల్పములు

దుస్సంకల్పములు అనే పంట యేమి చేసినా యిది తప్పేది కాదు. ఆ ఫలము తప్పక అనుభవించవలసి వస్తుంది. ఆ ఫలము మనము అందుకోవలసి వస్తుంది. నాటికి నూరుపాళ్ల పంట పండుతుంది. ఏ మాత్రము half percent కూడను తక్కువ కాదు.

ఇది చేతు అది చేతు ఇంతెన్నియో చేతు
నను చు ఊహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి యిచ్చేటు నుంటిరో
ఆ ఫలమ్ములె మీకు అందుచుండు
విత్తనమొకటైన వేరైన ఫలములు
సంభవించుట ఎట్లు సాధ్యమగును

కనుక యీ దేహమనే పొలమునందు యే విత్తనములు నాటుతున్నామో అదే పంటను మనము అనుభవించవలసి వస్తుంది. కనుక పంట మన సంకల్పములపైన ఆధారపడి వుంటున్నాది. పంట మన కర్మలపైన ఆధారపడి వుంటున్నాది. కనుక ఎట్టి సంకల్పములో అట్టి పంట. కనుక దైవమందిరమైన యీ దేహమందు సత్సంకల్పములనే బీజముతో నాటుకోటానికి తగిన అవకాశము. దేహము యిష్టము వచ్చినట్లు దుర్వినియోగము చేసుకోరాదు. నీ యిష్టాను సారము దానిని అనుభవించరాదు. నిత్యానిత్య విషయ పరిశీలన సల్పి దీనిని సద్వినియోగము గావించుకోవాలి.

కనుక మనము యీ దేహమును యే విధముగా వినియోగించుకోవాలి అనే విచారణ అత్యవసరము. దీనిని సద్వినియోగము గావించాలని ఆశించేవారు సద్భావములు అభివృద్ధి గావించుకోవాలని ఆశించేవారు, సత్ఫలములు మనము పొందాలని ఆశించేవారు రెండు విధములైన మార్గములను తూచా అనుసరించాలి. ఆహారనియమము విహారనియమము. రెండు కూడను అత్యవసరము. ఆహార విహారములు సరియైన మార్గములో అనుభవించాలి. ఎట్టి ఆహారమును మనము అందుకోవాలి. ఎట్టి ఆహారము మనము స్వీకరించాలి అనే విచారణ చెయ్యాలి. ఆకలి అయినప్పటికి మనకు విరుద్ధమైన ఆహారము భుజించరాదు. సాత్వికాహారమును భుజించాలి. ఒక చిన్న ఉదాహరణము. మనము ఒక మంట వేస్తాము. ఎలాంటి కట్టెలు వేసి మనము మంట వేస్తామో అలాంటి పొగ అందులోనుండి ఆవిర్భవిస్తుంది. గంధపు చెక్కలు వేస్తే సుగంధముగా వస్తుంది దాని పొగ. యింక దుర్గంధము తో చేరిన కట్టెలు వేస్తే అది దుర్గంధమే మనకు అందిస్తుంది.

ఎట్టి మంటనో అట్టి పొగ. ఎట్టి పొగనో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి నీరు. ఎట్టి నీరో అట్టి వర్షము. ఎట్టి వర్షమో అట్టి పంట. ఎట్టి పంటనో అట్టి వంట. ఎట్టి వంటనో అట్టి తలంపులు మనలో వస్తాయి. కనుక మనము భుజించే ఆహారము పురస్కరించుకొనియే మన తలంపులు మంచి చెడ్డలుగా మారుతున్నాయి. కనుక ఆహారనియమము అత్యవసరము యీ దేహమునకు. దేహ శుద్ధి జలము లో జరుగుతుంది. మనస్సు శుద్ధి అనేది సత్యముతోనే జరుగుతుంది. కనుక సత్యమార్గమైన ఆహారము మనము భుజించినప్పుడే సత్యసంకల్పములు మనలో ఆవిర్భవిస్తాయి. కనుక యీ పవిత్రమైన దైవమందిరముగా విశ్వసింపబడిన యీ దేహము నందు మత్తు పదార్థములు యే మాత్రము మనము స్వీకరించరాదు. రజోగుణసంబంధమైన ఆహారము మనము స్వీకరించరాదు.

ఈ ఆహార నియమము ఏమిటి? ఏది సాత్వికమని మనము నిర్ణయించాలి. ఏదో ఫలములు, పాలు భుజించటము సాత్వికమని భావిస్తున్నాము. అంత మాత్రమే కాదు సాత్వికము. మనము ఫలములు, పాలు కేవలము ఒక్క యింద్రియములో మాత్రమే అనుభవిస్తున్నాము. దేహము పంచేంద్రియములతో కూడినది. శబ్ద స్పర్శ రూప రస గంధము. మనకు ముక్కు వుంటుందాది. చెవులు ఉంటున్నాయి. నోరు వుంటున్నాది. కన్నులుంటున్నాయి చేతులుంటున్నాయి. చేతులు స్పర్శ. రూపము కన్నుల తో చూడగలదు. శబ్దము చెవుల లో వినగలదు. గంధమును ముక్కుతో వాసన చూడగలదు. ఈ విధముగా పంచేంద్రియములు కూడిన యీ దేహములో ఒక్క యింద్రియము ద్వారా ఫలము, పాలు భుజించినంత మాత్రమున సాత్వికమవుతుందా. మనము భుజించే ఆహారము పంచేంద్రియములలో చేరుతున్నది. కన్నులు పవిత్ర దృష్టి అనే సాత్వికాహారమును భుజించాలి. అంతేగాని కన్నులున్నవి కదా అని యిష్ట ప్రకారము చూడకూడదు. దీనిలో యనేక ప్రమాదములకు గురికావచ్చును. కనుక పవిత్రమైన భావము తోనే మనము యీ దృష్టిని వినియోగించుకోవాలి. కానీ యీ నాటి యువకులందు కీచక దృష్టి అభివృద్ధి అవుతున్నాది. ఈ కీచక దృష్టికి తగిన ఫలితము తలను బ్రద్దలు కొట్టించుకోటమే. కీచకునికి ఏమైంది. భీముడు గదను తీసుకొని తలను బ్రద్దలు కొట్టాడు. కనుక దృష్టి దోషము మనలో యే మాత్రము కలుగకూడదు. ఇది విద్యార్థులకు అత్యవసరము. పవిత్రమైన భావము తో దృష్టిని భగవద్భావములో దృష్టిని చూచినప్పుడే ఆ కన్నుల యొక్క ఆహారము చక్కగా సాత్వికమైన ఆహారముగా వుంటుంది. చెవులకు ఆహారము అత్యవసరము. పవిత్రమైన విషయా

లే మనము వినాలి. దైవ సంబంధమైన విషయాలే మనము శ్రవణము చెయ్యాలి. ఇతరుల యొక్క సంలాప వార్తను స్వీకరించాలి. ఈ విధముగా శ్రవణ దోషము లేకుండా మనము చూచుకోవాలి. దోషరహితమైన శ్రవణమును మనము స్వీకరించాలి. అప్పుడే యీ యిం ద్రియము ద్వారా సాత్వికాహారము ఆరగించినట్లవుతుంది. మనము ముక్కుల ద్వారా సుగంధమును మాత్రమే స్వీకరించాలి. దుర్గంధము స్వీకరించినప్పుడు ఆరోగ్యము దె బ్బతింటుంది. ఇంతే కాకుండా యీ స్వీకరించే గాలి లోపల అనేక క్రిములు కూడను చేరుతూ వుంటాయి. ఆరోగ్యమును చెడగొట్టే గాలిని మనము పీల్చరాదు. విశాలమైన ప్రదేశమునందు పవిత్రమైన గాలిని మనము స్వీకరించాలి. మనము చేతులతో కూడ ను ఆహారము స్వీకరించాలి. అనగా దోషరహితమైన కర్మలు ఆచరించాలి. అప్పుడే యిది దైవ మందిరముగా రూపొందుతుంది. వాగ్దోషము, దృష్టి దోషము, శ్రవణ దోషము, మ నస్సు దోషము, క్రియా దోషము యీ పంచ దోషములు మనము దూరము చేసినప్పుడు మనమే పరమాత్మగా మారతాము. పంచ దోషములతో నిండిన యీ దేహమును పవిత్ర ఆహారము స్వీకరిస్తున్నానని పాలు పండ్లు స్వీకరించినంత మాత్రమున అది సాత్వికాహార ము కాదు. ఈ పంచేంద్రియముల ద్వారా కూడను మనము సాత్వికమును అనుభవించా లి.

ఈ దేహమనే మందిరమునకు ఐదు ద్వారములుంటున్నాయి. ఈ ద్వారములు యెందుకోసం నిర్మించారు. దైవ దర్శన నిమిత్తమై ప్రవేశించే దివ్య భక్తుల నిమిత్తము యేర్పరచినది. ఒక్కొక్క దేవాలయమునకు అనేక ద్వారములు వుంటుంటాయి. ఈ ద్వారము లో భక్తులే ప్రవేశిస్తూ వుంటారు గాని అన్యులు ప్రవేశించరు. ఒక చిన్న ఉదాహరణము. మనము ఒక యిల్లు కట్టుకుంటున్నాము. చక్కగా సుందరముగా వుంటున్నాది. అనేక ద్వా రములు పెట్టుకుంటున్నాము. ఈ ద్వారములు యెందుకోసమని నిర్ణయించుకున్నాము. మనము మన బంధువులు, మనవారు అందులో ప్రవేశించటము వెలుపలకు పోవటము యీ అనుకూల నిమిత్తము ద్వారములు పెట్టుకొన్నాము. ద్వారము వున్నది కదా అని పందులు కుక్కలు అన్నింటిని ప్రవేశింప చేస్తామా. కాదు. కాదు. అలాంటి ప్రవేశింపరానివేమైనా వచ్చి నప్పుడు ద్వారమును బంధిస్తాము. ప్రవేశించ తగినవారు వచ్చినప్పుడు మాత్రమే ద్వారము తె రుస్తాము. ఇదే విధముగనే యీ దేహమనే దేవాలయము యొక్క ద్వారములు మనము పవి త్రమైన వాటికి మాత్రమే ప్రవేశించటానికి తగిన అవకాశము యివ్వాలి. అప్పుడే యిది

దేవాలయము మనే సార్థక నామాన్ని అందుకోగలదు. అప్పుడే దీనికి క్షేత్ర మనే నామము చెల్లుతుంది. అట్లుకాకుండా యిది క్షేత్రము క్షేత్రము అనుకుంటే యిది క్షేత్రమునకు విరుద్ధమైన మార్గమును అనుసరించినప్పుడు యిది క్షేత్రము కానేరదు. కనుక ఆహారము అత్యవసరము యీదేహము యొక్క సద్వినియోగమునకు.

ఇంక విహారము. మనము యేవిధమైన ప్రదేశమునకు వెళ్లాలి. ఏవిధమైన వాతావరణములో మనము జీవించాలి అనే విషయమును విచారించాలి. ఎట్టివారితో మనము సంబంధ బాంధవ్యమును పెంచుకోవాలి. దుస్సంగములో మనము దూరముగా వుంటుండాలి. దుష్టుల చెలిమి మనము దూరముగా వుంచాలి. కారణ మేమనగా ఎట్టి సంఘమును మనము అనుభవిస్తామో అట్టి భావములు మనలో ఆవిర్భవిస్తాయి. కనుకనే Tell me your company I shall tell you what you are. నీవు ఎలాంటి సంఘముతో కూడి వుంటావో అలాంటి వాడుగా తయారౌతావు. కనుక దుస్సంగమును దూరముగా వుంచాలి. తగిన ఆచరణ యందే దీనిని సద్వినియోగము చేయాలి. కాని యీనాటి యువకులకు దుస్సంగము చాలా అభిరుచిగా వుంటుంది. దుష్కర్మలలో ప్రవేశించటము చాలా సులభము. దురాచారములు చాలా సులభముగా జరుపుతున్నారు. ఇది మానవ దేహమునకు సరియైన విలువ కాదు. ఇంత దుర్లభమైన మానవ జన్మయెత్తి కూడను మనము యీవిధమైన పెడమార్గమును పట్టటము మానవత్వమునకే తీరనిలోటు. కనుకనే పవిత్ర ఋషులందరు యీదేహము చేత సత్కర్మలు ఆచరించే నిమిత్తమై భగవచ్చింతన చేసే నిమిత్తమై యేకాంతమునకు వెళ్లి అక్కడ తపస్సులు ఆచరిస్తూ వచ్చిరి. కాని నా వుద్దేశ్యము అది కూడను ఒక బలహీనతే. ఒక చిన్న ఉదాహరణము. నీవు కోపాన్ని జయించాలని సంకల్పించుకున్నావు. ఈ కోపాన్ని జయించాలని సంకల్పించుకొన్నప్పుడు నీవు అరణ్యములో కూర్చుని ఎన్నిసంవత్సరములు నీవు తపస్సు చేసినా యీ కోపము జయించలేరు. ఈ కోపమునకు కారణము యేమిటని మనము విచారించాలి. ఏస్థానములో నీకు కోపము ఆవిర్భవిస్తున్నది. జనసమూహములోనే కోపము ఆవిర్భవిస్తున్నది. కనుక నీవు జనసమూహమునందే వుంటుండి ఆ కోపము నీవు అరికట్టుకోటానికి ప్రయత్నించాలిగాని ఏ జనసమూహము లేని అరణ్యములోకి పోయి కోపాన్ని అరికట్టాననుకొంటే అది నిబ్రమగానే వుంటుంది. అరణ్యములో వుండినంత వరకు శాంతముగా వుండవచ్చును కానీ తిరిగి నీవు గ్రామములో ప్రవేశించేటప్పటికి

సిద్ధము సుమతీ అని ప్రవేశిస్తుంది. కనుక మన యింద్రియములను అరికట్టాలనుకున్నప్పుడు యిది ఒక కఠినమైన తపస్సుగా గాని ఇంద్రియ నిగ్రహము కోసము ప్రయత్నములుగానీ యివన్నీ భ్రమలు. దేహము యొక్క రహస్యాన్ని మనము గుర్తించినప్పుడు అది సులభముగా మనము అరికట్టవచ్చు. దేహము యొక్క రహస్యాన్ని గుర్తించకుండా ఎన్ని రకములైన ప్రయత్నములు చేసినప్పటికిని యిది ప్రయోజనము వుండదు. మనము కొత్త కారును కొన్నామంటే ఆకారును యే విధముగా వినియోగించాలి. ఎట్లా స్టాప్ చెయ్యాలి, ఎట్లా పెట్రోలు పెయ్యాలి, ఎక్కడ బ్రేక్ వత్తాలి యివన్నీ మనము చక్కగా గుర్తించినప్పుడే ఆకారు సద్వినియోగమవుతుంది. నా స్వంత డబ్బు పెట్టి నేను కారు కొన్నాను. నా పేరుతో యిది రిజిస్ట్రేషన్ అయింది. నాకారు అని నీవు స్టీరింగు దగ్గర కూర్చొని నీ యిష్టము వచ్చినట్లు డ్రైవ్ చేస్తే నీకూ ప్రమాదమే బయటవారికి ప్రమాదమే. నీ స్వంత కారు అయినప్పటికి నీవు దానిని ఎట్లా వినియోగించాలి అనే విధానమును మొట్టమొదట తెలుసుకోవాలి నేర్చుకోవాలి. ఆ విధముగా వినియోగించుకోటం తెలియకుండా పోవటం చేతనే యీ విధమైన కష్టనష్టములకు గురౌతున్నాడు మానవుడు. అనేక ప్రమాదములకు అశాంతికి గురౌతున్నాడు మానవుడు. అనేక రోగములకు కూడను గురౌతున్నాడు మానవుడు

ఒక్కటి మాత్రము మనము చక్కగా గుర్తించాలి. దైవనిర్ణయము ఎవరు విరుద్ధము చేయుటానికి వీలుకాదు. అది తప్పని శాసనము. ఆశాసనమును మార్చుకోటానికి ఎవరికి వీలుకాదు. మనము దేహమును పోషించుకుంటున్నాము. ఈ దేహము జడము ఎట్లా అవుతుంది అని అనేమంది వాదించవచ్చును. ఈ దేహము జడమైనదే. జడమైన దేహమైతే ఎట్లా పెరుగుతున్నాది. అని సందేహము రావచ్చు. పెరగటానికి యేమి పెద్ద కారణము కానక్కర లేదు. నిత్యము యిల్లు వూడ్చుకొని యింత చెత్త తీసుకువెళ్ళి దిబ్బలో వేస్తువుంటే ఆ దిబ్బ ఒక నెలలోపల పెరిగిపోతుంది. అట్లనే యీ జడమైన దేహానికి కాఫీలు టిఫెన్లు చెత్తనంతా వేస్తుంటే అది పెరుగుతూ వుంటుంది. జడము పెరగదనుకోటము చాలా తప్పు. జడము కూడను పెరగటానికి అవకాశము వుంటుంటాది. ఐతే చైతన్యము ఎక్కడ నుండి వచ్చింది. ఐతే యీ చైతన్యమునకు ఆధారము వుంటున్నాది. ఆ చైతన్యము యొక్క ఆధారము చేతనే యీ జడము అటుయిటు తిరుగుతున్నాది. మాటాడుతున్నాది. చూస్తున్నాది. కాబట్టి దీనికి ఆధారము వుండాలి. లోపల బ్యాటరీ కరెంటు వుండటం చేతనే head lights జడమనేవి వెలుగుతూ వున్నాయి. ఆ కారు లోపల హారన్

చెబుతున్నాది దారి విడచండి విడచండి అని చెబుతున్నాది. ఈ హారను జడము కదా. ఈ sound రావటానికి కారణము యేమిటి? లోపల కరెంటే. ఇంక యింజను. చూస్తే యింజనులో nuts, bolts, screws అంతా కూడా పని చేస్తున్నాయి. start చేసేటప్పటికి అన్నీ తమ తమ పనులు చేస్తున్నాయి. ఇవి జడమే కదా యీ విధముగా కదలటానికి కారణం యేమిటి? లోపలవున్న కరెంటే. అదేవిధముగనే యీ దేహమనేది ఒక కారు. ఈ కన్నులనేవి head lights చూస్తున్నాయి. మననాలుక ఒక హారన్ యిది అరుస్తున్నాది. మాట్లాడుతున్నాది. మన చెవులంతా Loud speakers. లోపల్ల కరెంటు లేకపోతే speakers పెట్టి ప్రయోజనము యేమిటి? ఈ అన్నింటికీని లోపల కరెంటు వుంటున్నాది. అదే ఆత్మ. ఈ ఆత్మ యొక్క శక్తి చేతనే జడమైన దేహము అన్నిపనులు చేస్తున్నాయి. ఒక magnet వుంటున్నాది. ప్రక్క లోపల యినుప ముక్కలు పడేశాము. ఆ magnet ఇటు తిప్పుతే అయినుప ముక్కలు దానిపైపున పరుగెత్తుతాయి. ఆ magnet ను అటు తిప్పుతే ఆ యినుప ముక్కలు అటు పరుగెత్తుతాయి. ఇనుప ముక్కలు జడమైనవి కదా. ఈ పరుగెత్తటానికి యేది ఆధారము. ఆ magnet. అదే విధముగనే భగవంతుడనే ఆత్మస్వరూపుడు ఆ magnet గా లోపల వుండి అన్నిటి చేత అన్నిపనులు చేయిస్తున్నాడు. అంతేగాని దేహము జడమైనది. ఈ జడమైన దేహమునకు అనేక రకములుగా అలంకారములు చేస్తున్నాము. ఎన్ని అలంకారములు చేసినప్పటికిని తాత్కాలిక తృప్తిలేగాని భగవంతుడు యిచ్చిన అలంకారము యిది మార్పు చేయటానికి వీలుకాదు. ఎన్ని పౌడర్లు అయినా వేసుకోవచ్చు. ఎంత సెంటు అయినా వేసుకోవచ్చు భగవంతుడిచ్చిన రంగు మాత్రము ఎవ్వరు మార్చటానికి వీలుకాదు. అదే సత్యమైనది. అదే నిత్యమైనది. అట్టి సత్యనిత్యమైన దైవత్వము ప్రతి మానవుని యందు వుంటున్నాది. అది తమ తమ కర్తవ్య నిమిత్తమై ధరించినదే యీ దేహము. కనుక దేహమే నిత్యమని దేహమే నేనని యీ విధమైన పెడ మార్గము లో ప్రవేశించరాదు. ఈ దేహమునకు మూడు రకములైన దోషము లుంటున్నవి. ఒకటి యేమంటే తాను కానటువంటి దానిని తానుగా భావిస్తున్నాది తనవి కానటువంటివి తనవిగా విశ్వసిస్తున్నాది. అనిత్యమైన వాటిని నిత్యముగా సత్యముగా విశ్వసిస్తున్నాడు. ఇవే మూడు దోషములు. ఈ దేహమే నేనని భ్రమిస్తున్నాడు మానవుడు. దేహమే తాను అనుకున్నప్పుడు యిది నాదేహమని యెందుకు చెప్పాలి. నాదేహము అనుకున్నప్పుడే నేను వేరు దేహము వేరు కదా. యిదినా Kerchief. నా Kerchief నాకు

దూరముగా వుంటున్నది. అదే విధముగా నా దేహము అనుకున్నప్పుడు దేహము నీకు దూరముగా వుండాలి కదా. కాబట్టి దేహమే నేను అని ఎలా చెప్పగలవు యిదే ఒక దోషము. ఈ దేహమే నేను అనుకోటమే దోషము. ఐతే జగత్తునందు యిది నా భూమి యిది నా యిల్లు యిది నా కారు నా వస్త్రవు అని అనేక రకములుగా నావి నావి అనే భావముతో మోసపోతున్నాము. ఎంతవరకు యిల్లు కట్టావు యిది నాది అనుకుంటున్నావు. అమ్మివేశావు అది నీది కాదు. కారు నాది అనుకుంటున్నావు వుపయోగించుకున్నంత వరకు నీది అమ్మివేసిన తరువాత నీది కాదు. ఇవి క్షణభంగురమైనవిగా విశ్వసించక యివి నావి నావి అని దాని నిమిత్తమై అభిమాన మమకారములు పొందుతున్నాము. ఏదీ నీది కాదు. ఏదీ నీవు కాదు. దేహమూ నీవు కాదు. నీవు కాని దేహమునకు సంబంధించిన పదార్థములంతా నీవు ఎట్లా అవుతాయి. ఇది అంతా కేవలము ఒక మాయ చేత కప్పబడి మమత చేత నింపబడి భ్రాంతి చేత నడచుకుంటూ వస్తున్నాయి. యివన్నీ మధ్యలో కదలిపోయేటువంటివే. పెండ్లికాక పూర్వము ఎవరు భార్య ఎవరు భర్త ఎవరు చెప్పలేరు. పుట్టక పూర్వము తల్లి ఎవరో కుమారుడు ఎవరో ఎవరు చెప్పలేరు. పుట్టిన తరువాతనే యితను నా కుమారుడని అంటాము. వివాహము జరిగిన తరువాతనే యీమె నా భార్య అంటాము. అంతకు పూర్వము వారెవరు నీవెవరు? యివన్నీ మధ్యలో కలసిన మేఘములే కదా. కనుక ఒకదానికొకటి యేమాత్రము కూడను శాశ్వత సంబంధములు లేవు.

నావారు, నాది అనుకుంటున్నాము. అదే దేహభ్రాంతి. ఎవ్వరు కూడను వచ్చే సమయములో యింత బట్ట అయినా తీసుకొని రాడు. పోయే సమయములో ఎడ్రస్సైనా యిచ్చిపోడు. నిజంగా నీవాడైతే ఎడ్రస్సు ఎందుకివ్వకూడదు. ఎక్కడికి పోతున్నాడో చెప్పకూడదు. ఏదీ నీది కాదు. కానీ యీ మిథ్యాలోకమందు సత్యమైన తత్వమును విశ్వసించక అసత్యమైన దానిని విశ్వసించి మనము యీ అవస్థలకు గురౌతున్నాము. నీవు ఎప్పుడూ నీవే. నీవు ఎవరివాడు కాదు. ఎవరు నీవారు కాదు. వున్నది ఒక్కటే. ఏకం సత్ విప్రా బహుధా వదంతి వున్నది ఒక్కటే అయినప్పటికి అనేక రకములుగా మనము భావిస్తున్నాము. ఒక యింటి యజమాని వుంటాడు. భార్య వస్తుంది my dear husband అంటుంది. బిడ్డ వస్తుంది my dear father అంటాడు. తల్లి వస్తుంది my dear son అంటుంది. కోడలు వస్తుంది my dear father-in-law అంటుంది. ఇవన్నీ దేహమునకు సంబంధించిన పేర్లు తప్ప వ్యక్తి ఒక్కడే. కొడుకు తానే తండ్రి తానే మామ తానే అన్న తానే. ఒక్కొక్కరు ఒక్కొక్క సంబంధము చేత తాము పిలుచుకుంటూ వచ్చారు. అతనినే యనేక విధములైన సంబంధములుగా

అనుభవిస్తూ వచ్చారు. ఏకోహం బహుస్యాం వున్నది ఒక్కటే అయినప్పటికిని అనేకముగా రూపొందుతున్నది. ఈ అనేకత్వములో వుండిన ఏకత్వము ఒక్కటే. వున్నది ఒకటే. అదే HERO. ప్రపంచమంతా ZERO. ఈ జీరో హీరో ప్రక్కలో పెడితే Ten అయిపోతుంది. యింకొక జీరో పెడితే hundred అయిపోతుంది. యింకో జీరో పెడితే thousand అయిపోతుంది. ఈ జీరోకి ఎక్కడ నుండి విలువ వస్తున్నది. ఈ హీరో నుంచినే జీరోకు విలువ వస్తున్నది. హీరో తీసేస్తే అంతా జీరోనే. కనుక దైవమే హీరో. ఈ దేహభ్రాంతి, యీ మనోభ్రాంతి, యీ బుద్ధి భ్రాంతి, యీ లోకభ్రాంతి యివన్నీ జీరోలే. ఐతే మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. దీనిని వదలనక్కర లేదు. నీ బిడ్డను నీవు పోషించే కర్తవ్యము నీది. కనుక ఎవరెవరి కర్తవ్యమును వారు నిర్వర్తించుకుంటూ పారమార్థిక దృష్టిని చలించకుండా చూచుకోవాలి.

పారమార్థిక దృష్టితో వ్యవహారికమైన జీవితమును అనుభవించాలి. ఈ లోకములో వుండినంత వరకు లోకసంబంధమైన నియమాల్ని అనుసరించాలి. ఎన్ని అనుసరించినప్పటికిని మన యొక్క లక్ష్యము ఒకటిగానే వుంటుండాలి. ఏదీ మనది కాదు.

మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు సహోదరః
అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత.

లోకములో అన్నీకూడను యేనాటికైనా మార్పు చెందునవే. కనుక యిట్టి మార్పు చెందే మనస్సును యేవిధముగా కలిగి వుంటున్నాము. ఈ ఆహార విహారముల చేతనే యీ దేహము యిన్నిరకములైన మార్పు చెందుతూ వుంటున్నది. ఎన్ని మార్పులు చెందినా వ్యక్తిత్వము ఒకటే. కాలానుగుణ్యముగా దీనికి పేరులు రూపము మారుతూ వచ్చాయి. పసి బిడ్డగా వున్నప్పుడు child అని పిలుస్తూ వచ్చాము. పది సంవత్సరములు పెరిగేటప్పటికి యితనిని boy అని పిలుస్తూ వచ్చాము. ముప్పది సంవత్సరములు అయ్యేటప్పటికి man అని పిలుస్తూ వచ్చాము. డెబ్బది యైదు సంవత్సరములు వస్తే grand father అంటున్నాము. ఈ child, boy, father grand father ఒక్కడే. ఈ విధమైన రూపనామముల చేతనే యీ విధమైన సంబంధములను మనము ఆవిర్భవిస్తున్నాము. ఇవి కేవలము భ్రాంతులే. ఇట్టి భ్రాంతులకు ఆధారమైనదే యీ దేహము. కనుక దేహము శాశ్వతమని, సత్యమని అనేక రకములుగా విశ్వసించటము యేమాత్రము చెల్లదు. ఐతే వుండినంత వరకు పరాధీనము కాకుండా రోగములకు గురికాకుండా చూచుకొన వలసిన కర్తవ్యమున్నది.

ఈ పని ముట్టును తగినంత వరకు పనికి తగిన రీతిగా మార్చుకోవాలి. నీరుదాటి

తవరకును, నదిని దాటేంతవరకు మన యొక్క పడవ చిల్లులు పడకుండా శిథిలము కాకుండా చూచుకోవాలి. మనము ఎంతకాలము యీ జీవితమనే నదిలో ప్రయాణము చేసినప్పటికిని పడవలో మాత్రము నీరు రాకుండా చూచుకోవాలి. పడవను నీటిలో వే యి కాని నీరును మాత్రము పడవలో రానీయకు. నీవు సంసారములో వుంటుండు. నీకర్తవ్యములు నీవు అనుభవించుగాని నీవు దానిని మనస్సులో పెట్టుకొని బాధించకు. దానివలనే రోగములు అభివృద్ధి అవుతున్నాయి. నీవు ఎక్కడ వుండాలో అక్కడ వుండాలి. నీవు దీనిని ఒక పనిముట్టుగానే విశ్వసించాలి. నీకర్తవ్యము నీవు ఆచరించు అంతేగాని బాధ్యత అంతా మనస్సులో పెట్టుకొని వూరికే అనారోగ్యమునకు గురికాకూడదు. కనుక దేహమును సరియైనస్థితిలో మనము వుంచుకోవాలనుకున్నప్పుడు ఆహార విహారములు అత్యవసరము. కనుక యీ దేహము ఒక పనిముట్టుగా మనము విశ్వసించి, మనము ధరించిన వస్త్రముగా స్వీకరించి యీ వస్త్రములో చేరిన మాలిన్యమును అప్పుడప్పుడు పరిశుద్ధము గావించుకోటానికి తగిన కృషి చేయాలి. మనము ధరించిన వస్త్రము మాలిన్యమవుతుంది ఏమి చేస్తున్నాము. దోభికి వేస్తున్నాము. దోభి యేమి చేస్తున్నాడు. మలినమును తీసి వేస్తున్నాడు. దీని యొక్క సహజ రంగు యేమిటి? సహజరంగు తెలుపు. కానీ మనము వుపయోగించుకోటం వలన వేరే రంగుగా మారుతుంది. యీ మారిన మాలిన్యములో కూడిన వస్త్రము చాకలికి వేస్తున్నాము. చాకలి దీని మాలిన్యము తీసి తీసుకు వస్తున్నాడు. మనము అనుకుంటున్నాము భ్రాంతి చేత చాకలి దీనిని తెల్లగా చేసుకు వచ్చాడని. తెలుపు దీని స్వభావమే. యిది కొత్తగా చాకలి యివ్వలేదు. చాకలి చేసిన పని దీని మాలిన్యమును దూరము చేశాడు. అదే విధముగానే మనము యీ ధరించిన దేహము సహజమైనరంగే సహజమైన స్వభావము తే. కాని అస్వభావము లో మనము వినియోగ పెట్టుకోటం చేత యిందులో మాలిన్యము చేరిపోతున్నాది. దానిని భగవచ్చింతన, భగవత్ప్రేమ, భగవత్ ధ్యానము అనే చాకలికి వేసినప్పుడు అది పరిశుద్ధమైపోతుంది. భగవంతుడు చాకలివాడు. అనగా నీహృదయమును పరిశుద్ధము గావించే వాడు. కనుక నీహృదయాన్ని భగవంతునికి అప్పచెప్పు. తానే దానిని శుభ్రపరుస్తాడు. అట్లు కాకుండా నీ మాలిన్య వస్త్రమును ఎవరికి వేసి పరిశుద్ధము గావించుకోవాలో ఆ విధానము నీవు గుర్తించుకోకుండా ఆ వస్త్రమును మంగలివానికి వేస్తే వాడేమి చేస్తాడు. కనుక శుభ్రము చేయాలంటే చాకలివానికే వేయాలి. నీహృదయము పరిశుద్ధము కావాలంటే భగవంతునికే అప్పచెప్పాలి. మరొకరు

12005901 3E

శుభ్రము చేయ లేరు. కనుక యీదేహము సద్వినియోగము చేసుకొనే మార్గములో ప్రవేశ పెట్టినప్పుడు యీదేహము సత్కార్యాల చేత సార్థకమవుతుంది. ఇది ధరించిన వస్త్రము వంటిదే. కనుక దేహము ఒక వుపాధి. దేహమే నీవు కాదు. కాన యీ నేను కాని దేహమును నేనుగా భావించుకోటమే అజ్ఞానము. ఈ అజ్ఞానమును నిర్మూలము గావించుకున్నప్పుడే నీవు జ్ఞాన భాస్కరుడుగా ప్రకాశిస్తావు.

విద్యార్థులారా! దేహ తత్వాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నము చేయండి. ఈ దేహమునకు మరికొన్ని ఆధారాలు వుంటున్నాయి. ఈ దేహము కేవలము వట్టి బట్టవలె లేదు. మనము ఒక shirt ను ధరించామంటె దానికి అనేక రకములైన భాగాలంతా వుంటున్నాయి. ఇక్కడ collar వుంటుంది. shoulders వుంటాయి. చేతులు వుంటాయి. పాకెట్ వుంటుంది. అనేక రకములైన అంగములు చేరివుంటాయి. ఈ విధముగా shirt కు అంగములు వుంటున్నాయి. అదే విధముగా దేహమునకు అంతర అంగములు, యింద్రియములు కూడా వుంటున్నాయి. ఈ యింద్రియాలతో బాటు దీనికి ప్రధానమైన మనస్సు కూడా వుంటున్నది. ఇంద్రియములు మనస్సు సరియైన స్థితిలో వుంటానే బుద్ధి కూడా వుంటుంది. ఈ మైండ్ అనేది ఎట్లా వుంటుందంటే మనము జేబులోపల యేదో ఒక పదార్థము వేసుకున్నాము. లేక ఒక లడ్డు ప్రసాదము యిచ్చేటప్పటికి జేబులో పెట్టుకున్నావు. లడ్డు లడ్డుగానే వుంటున్నాది. లడ్డుచే యిబడిన oil నీ shirt ను పాడు చేసింది. వక్కనో, లవంగమునో యిలాంటివి నీ జేబులో వేసుకున్నావు. నీవు మరచి చాకలికి వేస్తె అక్కడ ఒక colour వచ్చేస్తుంది. కనుక యీ మార్పులంతా రావటానికి మన సంకల్పములే. కనుక సంకల్పములను సక్రమమైన మార్గములో పెట్టుకోవాలి. ఈ దేహమనే వస్త్రము అనేక అంగములతో కూడి వుంది. నిజముగా vice-chancellor కోరినట్లుగా శరీరము, యింద్రియములు, మనస్సు, బుద్ధి యీ నాల్గింటి యొక్క రహస్యమును చక్కగా గుర్తించినప్పుడే నిజముగా మానవుడు పరిపూర్ణుడౌతాడు. దీని రహస్యమును మనము గుర్తించుకోకుండా పోవటం చేతనే యనేక చిక్కులకు గురైపోతున్నాము. అనేక అశాంతులకు గురైపోతున్నాము. ఏదో సాధన సాధన అనేటిం ట్లో కాలమును వ్యర్థము చేస్తున్నాము. ఎట్టి సాధనలు మనము చేయనక్కరలేదు. సత్యము గుర్తించుకుంటే అదే సాధన. సర్వసాధనలు కూడ సత్యమును బోధించేవే. సత్యమును దర్శింప చేసేవే. సత్యదర్శనమైన తరువాత యింక సాధన ఎందుకు. వంట అయ్యేంత వరకే కట్టెలతో మనకు అవసరము. వంట పూర్తి అయిన తరువాత కట్టెలు మన

120059014E

కు అక్కరలేదు.. కనుక ఈ దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి వాటి రహస్యములను చక్కగా మొదట గుర్తించాలి.

విద్యార్థులారా! ఈ పదహైదు దినముల లోపల vice chancellor కోరినట్లుగా దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి అన్నింటికిని సాక్షీభూతమైన ఆత్మ, ఈ ఐదింటి తత్త్వమును మనము చక్కగా గుర్తించుకుంటే పంచభూతముల ప్రపంచమును మనము హస్తగతము గావించుకోవచ్చు. సర్వత్ర నిండినది పంచభూతములే. ఈ దేశమంతా సంచరించేది పంచభూతములే. ఈ దేశమంతా దేహము యొక్క ప్రతిబింబములే. కనుక బింబ ప్రతిబింబముల యొక్క సత్యాన్ని మనము గుర్తించుకోటము అత్యవసరం. కేవలము గుర్తించుకున్నంత మాత్రమున చాలదు. దీనిని చక్కగా అర్థము చేసుకొని వర్తించాలి. అన్నింటిని భగవంతుని రహస్యముగా భావించుకోవాలి. ఇది భగవత్సంకల్పమే. భగవత్సంబంధమైన విశ్వాసమును విద్యార్థులు అభివృద్ధి గావించుకోవాలి. నీ చిత్తమును భగవంతునికి అర్పితము గావించుకొనే ప్రయత్నం చేయండి.